క్లుప్తంగా

సన్మానం



నర్సంపేట : పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా చలపతిని ఎస్‌ఎస్‌యూఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్ హాస్టల్ విద్యార్థుల సమస్యలను ప్రిన్సిపాల్ చలపతి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై ప్రిన్సిపాల్‌తో చర్చించారు.

సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సురేందర్



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలోని గిరిజన సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా గట్ల సురేందర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అయన హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐఐటీ స్టడీ సెంటర్‌కు గ్రేడ్-2 పని చేశారు. గ్రేడ్-1 ప్రిన్సిపాల్‌గా ఉద్యోగోన్నతి పొంది అశోక్‌నగర్‌లోని స్కూల్‌కు బదిలీపై వచ్చారు. గతంలో వరంగల్, దామెరవంచ, ఏటూర్‌నాగారం, కొత్తగూడ, దమ్మపేటలోనూ ఆయన విధులు నిర్వర్తించారు.

ఎంపీఓగా సునీల్



ఖానాపురం : మండల పంచాయతీ అధికారిగా అంబటి సునీల్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన రవి బదిలీ అయిన విషయం తెలిసిందే. నర్సంపేట ఎంపీఓగా పని చేస్తూ ఖానాపురం ఎంపీఓగా బదిలీపై వచ్చారు.

కుక్కల దాడిలో 10 గొర్రెపిల్లల మృతి



రాయపర్తి : వీధి కుక్కల దాడిలో 10 గొర్రెపిల్లలు మృతి చెందిన ఘటన మండలంలోని పెర్కవేడులో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నిమ్మల అనిల్ అతడి గొర్రెల మందను మేపడానికి ఉదయం వెళ్లాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద దొడ్డిలో ఉన్న గొర్రెపిల్లలపై సుమారు 8 వీధి కుక్కలు గుంపుగా దాడి చేయడంతో గొర్రెపిల్లలు మృతి చెందాయి. తనకు సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు అనిల్ వాపోయాడు. వీధి కుక్కల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరామర్శ

దుగ్గొండి : మండలంలోని శివాజీనగర్‌కు చెందిన బుస్సారి కార్తీక్ సుమారు 10 రోజుల క్రితం మృతి చెందగా అతడి తండ్రి వసంతరావును నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.4 వేల నగదు, 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మట్ట రాజు, ఒలిగె నర్సింగరావు, దంజ్యానాయక్, జయరాంనాయక్, భరత్‌రెడ్డి, శివాజీ, నాగరాజు, రవివర్మ, బండారి ప్రకాశ్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి..

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోతి వీరన్నను అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న సందర్భంగా ఆ పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

సంగెం : మండలంలోని మొండ్రాయికి చెందిన ఏడాకుల లింగమూర్తి ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేశ్ సోమవారం 50 కేజీల బియ్యం సాయంగా అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పరికి యాకయ్య, రాజు, ఏలియా, రాములు, దయాకర్, కిషన్, చాతాళ్ల సారయ్య, మురళి, చంద్రమౌళి, వేల్పుల కుమారస్వామి పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటకు చెందిన కూనూరు సతీశ్‌కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా ఆయనకు ఆయన పని చేస్తున్న కోరమండల్ అగ్రిసైన్స్ కంపెనీ ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం రూ.5 వేల సాయం అందజేశారు. తొలుత సతీశ్‌ను పరామర్శించారు. కంపెనీ బాధ్యులు సతీశ్‌ను ఆర్థికంగా ఆదుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బేతి నగేశ్ కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఓదెలు, సుభాష్, తోటకూరి శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఆత్మహత్య కాదు.. హత్యే

- మృతురాలి బంధువులు, తండావాసుల ధర్నా

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ శివారు బోటికాడితండాలో భూక్య తార అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా ఆమె ఆత్మహత్య చేసుకోలేదని, హత్య చేశారని ఆమె బంధువులు, తండావాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ సెంటర్‌లో సుమారు నాలుగు గంటల పాటు సోమవారం ధర్నా నిర్వహించారు. తార భర్త శ్రీనివాస్ అలియాస్ చిరంజీవిని గతంలో హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారని, మృతురాలి కుమారుడు భరత్‌ను హత్య చేసి ఆస్తి మొత్తం లాక్కునేందుకు బాలాజీ అనే వ్యక్తి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. బాలాజీకి పోలీసులు సహకరిస్తున్నారని ధ్వజమెత్తారు. న్యాయం జరిగే వరకు తార అంత్యక్రియలు నిర్వహించబోమంటూ తేల్చి చెప్పారు. మామునూరు ఏసీపీ తిరుపతి ఆందోళనకారులతో మాట్లాడి నిరసన విరమింపజేశారు. గీసుకొండ, మామునూరు, పర్వతగిరి సీఐలు బాబులాల్, కృష్ణవేణి, శ్రీనివాస్, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు, తండావాసులు

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మామునూరు ఏసీపీ తిరుపతి స్పష్టం చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోటికాడితండాలో తార అనుమానాస్పద మృతిపై విచారణ చేయగా మొదట ఆత్మహత్యగా తెలిపారని చెప్పారు. మృతురాలి సోదరుడు బాషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తుండగా పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ చేసుకుంటామని చెప్పి వెళ్లి ధర్నా చేయడం, కారంపొడి ప్యాకెట్లతో పోలీసులపై దాడి చేద్దామని ఆలోచించడం చట్టాన్ని చేతిలోకి తీసుకునే ప్రయత్నమేనని అన్నారు. దర్నా చేసిన విషయంలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో పర్వతగిరి, ఏనుమాముల, గీసుకొండ సీఐలు శ్రీనివాస్, పులి రమేశ్, సీఐ బాబులాల్, సంగెం ఎస్సై నరేశ్, నెక్కొండ ఎస్సై మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- రియల్టర్ల మోసాలతో..
- పోలీస్‌స్టేషన్ ఎదుట ఘటన

గీసుకొండ : కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని కోనాయమాకుల పాములబోడు భూములను రియల్టర్లు సూర్యదేవర రమేశ్, ఇప్పలపల్లి శివకుమార్ ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఆ వెంచర్‌కు వెళ్లే దారిలో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త శిరిసె రాజు, లింగంపెల్లి నూతన్‌ప్రసాద్‌కు చెందిన వ్యవసాయ భూములున్నాయి. సదరు వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు తమ వెంచర్‌లోని ప్లాట్లను కొనుగోలు చేయాలని రియల్టర్లు రైతులను ఒత్తిడి చేస్తున్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా 307 గజాల భూమిని ఇద్దరు రైతులు కొనుగోలు చేసి రూ.10 లక్షలు చెల్లించారు. మిగతా డబ్బు చెల్లించాల్సి ఉండగా సదరు భూమిని వారికి తెలియకుండా పట్టాదారు నర్సంపేటకు చెందిన వ్యక్తులకు విక్రయించాడు. దీంతో శివకుమార్, రమేశ్‌లను నిలదీయగా వారు దాటవేశారు. పట్టాదారును ప్రశ్నించినా స్పందించకపోవడంతో రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం జరగడం లేదంటూ గ్రామంలోని వాట్సాప్ గ్రూపుల్లో పలుమార్లు పోస్టులు పెట్టాడు. రాజును నాయకులు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి సమస్య వివరించగా న్యాయం చేయాలని ఆయన పోలీసులకు సూచించారు. అయినా తనకు న్యాయం జరగడం లేదని భావించి రాజు సోమవారం మోటార్‌సైకిల్‌పై పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఏఎస్సై సుదర్శన్, సిబ్బంది అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. రాజుకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా 300 రీడింగ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. సీఐ బాబూలాల్‌ను వివరణ కోరగా రాజు మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని చెప్పారు. రాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు



రోగులను పరీక్షిస్తున్న రహేలా తన్వీర్

నెక్కొండ : సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల వైద్యాధికారి రహేలా తన్వీర్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని చంద్రుగొండ, నెక్కొండ, అప్పల్‌రావుపేట, రెడ్లవాడ, దీక్షకుంట సబ్ సెంటర్లలో డాక్టర్ సుమన్ పర్యవేక్షణలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రహేలా తన్వీర్ పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు అందించారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. సమాజంలోని ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. దోమకాటుతో జ్వరాల బారిన పడే ప్రమాదం ఉన్న క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జ్వరం, బీపీ, షుగర్, తదితర సమస్యలతో బాధపడుతున్న పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రజలు వైద్య శిబిరాలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు రాహుల్, రమ్య, మౌనిక, పీహెచ్‌ఎన్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్లు యాకస్వామి, వరమ్మ, హెల్త్ అసిస్టెంట్లు రవిచందర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, యాకలక్ష్మి, సరిత, రజిత, సరోజన, నాగలక్ష్మి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలులో నిర్లక్ష్యం

నర్సంపేట : బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని కామారెడ్డి ఎన్నికల సభలో ఇచ్చిన హామీని అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపల్లి రాజు, గూడూరు సందీప్ విమర్శించారు. ఈ మేరకు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు, సందీప్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్న హామీని తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 23 నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గొల్ల కురుమలకు వంద రోజుల్లో రెండో దశ గొర్ల పంపిణీ సంబంధించి రూ.2 లక్షలు లబ్ధిదారుల ఖాతాలో వేస్తామని, ఇతర అనేక హామీలను విస్మరించిందని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వెంటనే అన్ని హామీల అమలు దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, పట్టణ అధ్యక్షుడు తొటం నిశాంత్, యువ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొంకీస విఘ్నేశ్ గౌడ్, ఐటీ విభాగం సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కోమండ్ల సప్తగిరి, ఎస్సీ మోర్చా జిల్లా కోకన్వీనర్ కూనమల్ల పృథ్వీరాజ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సంధ్యారాణి, సీనియర్ నాయకలు శీలం సత్యనారాయణ, బాల్నె జగన్, ప్రతిక్షసింగ్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత



దుగ్గొండి : మండలంలోని మందపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భక్తురాలు అంబరగొండ రాజమాత సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, అభ్యసన సామగ్రి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం, దాతలు కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు తోడ్పాటు అందిస్తామని చెప్పారు. రాజమాత దాతృత్వాన్ని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చందుపట్ల లక్ష్మీ, అప్పాల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కోశాధికారిగా రాంనర్సయ్య



నల్లబెల్లి: ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారిగా మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి రాంనర్సయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం ఆల్ ఇండియా అధ్యక్షుడు సుర్జిత్‌బోస్ సోమవారం నియామక పత్రం అందించారు. సంఘం కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 20, 21 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగాయి. ఈ సమావేశాల్లో రాంనర్సయ్యను రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన జోనల్ నాయకులు మంజునాథ, నర్సింహరావు, కోటేశ్వర్‌రావులకు రాంనర్సయ్య కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నర్సంపేట : నర్సంపేట డిపో పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం కోసం నేడు (మంగళవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం ప్రసూనలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల ప్రజలు మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సలహాలు సూచనల కోసం 9959226052, 7382926166 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేటలో ఎలికట్టె నర్సయ్యకు చెందిన ఇల్లు సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఆయన భార్యతో కలిసి వర్ధన్నపేటకు వెళ్లగా అదే సమయంలో అతడి ఇంట్లో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ఇళ్ల ప్రజలు విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలు ఆర్పి నర్సయ్యకు సమాచారం అందించారు. ఇంట్లో ఉన్న 4 బస్తాల పత్తి, రెండు బస్తాల బియ్యం, దుస్తులు, నిత్యావసర వస్తువులతోపాటు రూ.5 వేల నగదు మంటల్లో కాలి బూడిద అయినట్లు బాధితుడు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుక



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దాశరథి కృష్ణమాచార్యుల 99వ జయంతి వేడుకను సోమవారం నిర్వహించారు. ఎస్‌ఓ మెట్టుపల్లి జ్యోతి జ్యోతిప్రజ్వలన చేసి కృష్ణమాచార్యుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పదో తరగతి విద్యార్థులతో ఉపన్యాసం, కవిత, పద్యాలు చదివించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజస్విని, షాహీన, రజిని, రజిత, పల్లవి, రాజ్యలక్ష్మి, దేవిక, ఉమ, సుజాత, రజిత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

చెన్నారావుపేట/రాయపర్తి : రైతుబీమా కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని చెన్నారావుపేట, రాయపర్తి మండల వ్యవసాయ అధికారులు శశికాంత్, గుమ్మడి వీరభద్రం కోరారు. వారి కార్యాలయాల్లో సోమవారం వేర్వేరుగా వారు విలేకరులతో మాట్లాడారు. ధరణి పోర్టల్‌లో జూన్ 28వ తేదీ నాటికి పట్టా కలిగిన, కొత్తగా ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా పొందిన రైతులు అర్హులని చెప్పారు. దరఖాస్తుదారులు 1965 ఆగస్టు 14 నుంచి 2006 ఆగస్టు 14 నడుమ జన్మించి ఉండాలని సూచించారు. రైతు నామినేషన్ ఫారం మీద సంతకం చేసి భూమి పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్, నామినీకి సంబంధించిన ఆధార్ కార్డ్ జిరాక్స్‌లు ఏఈఓలకు అందించాలని తెలిపారు.

'స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి'

నల్లబెల్లి : వికలాంగులకు కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు అడ్డ రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. స్మితా సబర్వాల్ మాటలు చట్టాలను, కోర్టు తీర్పులను తప్పుబట్టేలా ఉన్నాయన్నారు. స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుడుంబా విక్రేతపై కేసు

గీసుకొండ : మండలంలోని నందానాయక్ తండాలో బాదావత్ వీరన్న నుంచి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాబులాల్ తెలిపారు. ఏఎస్సై, పోలీస్ సిబ్బంది సోమవారం పెట్రోలింగ్ చేస్తుండగా వీరన్న గుడుంబా విక్రయిస్తూ పట్టుబడినట్లు సీఐ పేర్కొన్నారు.

జేపీఎస్‌ల బదిలీ

చెన్నారావుపేట : మండలంలోని గ్రేడ్-4 జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్)బదిలీ అయినట్లు ఎంపీడీఓ గడ్డం దయాకర్, ఎంపీఓ శ్రీధర్ రాజు తెలిపారు. ఎంపీడీఓ, ఎంపీఓ సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. పాపయ్యపేటకు రాజు, జీడిగడ్డతండాకు రాజ్‌కుమార్, పుల్లయ్యబోడు తండాకు మహేశ్, నెక్కొండ మండలంలోని దేవునితండాకు శ్రావణ్‌కుమార్, ఖానాపురం మండలం రాగంపేటకు మాలతి, చిలుకమ్మ తండాకు భరత్‌కుమార్, నెక్కొండ మండలం పిట్టకాలబోడు తండాకు సాంబరాజు బదిలీ అయ్యారని వివరించారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు.

తుంగబంధం కాల్వకు గండి



తుంగబంధం కాల్వకు పడిన గండి



నీటిలో మునిగిపోయిన పంట పొలాలు

- నీట మునిగిన పంట పొలాలు

ఖానాపురం : మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాఖాల ఆయకట్టు పరిధిలోని ఖానాపురం శివారులోని నర్ర పూర్ణయ్య బుర్ర సమీపంలో తుంగ బంధం కాల్వకు గండి పడింది. దీంతో నీరంతా సమీపంలోని పంట పొలాల్లోకి చేరింది. ఇప్పటికే నాట్లు వేసుకున్న పలువురు రైతులకు చెందిన సుమారు 15 ఎకరాలతోపాటు తుంపర సేద్యం విధానంలో సాగు చేసుకుంటున్న మరికొందరు రైతులకు చెందిన పది ఎకరాల పంట నష్టం వాటిల్లింది. గండిని వెంటనే పూడ్చి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అంగడి సమస్యల పరిష్కారానికి చర్యలు

సాక్షి స్పందన

పర్వతగిరి : 'చినుకు పడితే చిత్తడి..' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ శంకర్ స్పందించారు. మండల కేంద్రంలోని అంగడిని పంచాయతీ సిబ్బందితో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. వ్యాపారులు, వినియోగదారులతో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. వర్షానికి అంగడిలోని రోడ్లు బురదమయం అవుతున్నాయని, విద్యుత్ బల్బులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తదితర సమస్యలను వ్యాపారులు, వినియోగదారులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. వర్షం కారణంగా అంగడిలో నీరు నిలుస్తోందని చెప్పారు. అంగడిలో నెలకొన్న నీరు నిలుస్తున్న ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. గ్రామపంచాయతీ సిబ్బందికి సూచనలు అందించారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రాజకీయ రిజర్వేషన్ సాధనే ధ్యేయం

- హక్కుల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

వర్ధన్నపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ సాధించడమే ధ్యేయంగా పోరాడతామని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ తెలిపారు. మండలంలోని ఇల్లందలో సోమవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి మండల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షరీఫ్ అధ్యక్షత వహించగా రాజేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వికలాంగుల హక్కులను, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలును విస్మరిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని, వికలాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత సీనియర్ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కళ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో స్మిత సబర్వాల్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు జట్టబోయిన శ్రీనివాస్, నర్సింహులు, సుమతి, బాలకృష్ణ, మత్స్యగిరి, షరూఫ్, ఆకారపు వెంకన్న, వంటిపాక ముత్తయ్య, రమేశ్, ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రాజేశ్, నాయకులు

విద్యారంగానికి 30 శాతం కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

నర్సంపేట : బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొగిలిచర్ల సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తామన్న హామీని విస్మరించి విద్యార్థి, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేలా సరిపడా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. గురుకులాలకు పక్కా భవనాలు లేక వర్షాకాలంలో అద్దె భవనాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలోని 50 శాతం స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లకు పక్కా భవనాలు, మంచినీటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో ఫుడ్ పాయిజన్, విద్యార్థుల ఆత్మహత్యలు, విద్యార్థులపై లైంగిక దాడులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ, ఉన్నతాధికార పోస్టులు భర్తీ చేయడంలో బడ్జెట్‌లో నిధులు కేటాయింపు కీలకమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కన్వీనర్ సమ్మెట వర్షన్, నాయకులు రవళి, రమ్య, వెంకటేశ్, రాము, సంధ్య, రమేశ్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

నర్సంపేట : విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం వరంగల్ విభాగ్ కన్వీనర్ అయిత నిఖిల్ తెలిపారు. పట్టణంలో సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్సిటీలో ఐదుగురు విద్యార్థులతో మొదలై ప్రస్తుతం 60 లక్షల సభ్యత్వంతో ముందుకు సాగుతోందని చెప్పారు. అనంతరం నగర కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రాకం రాకేశ్ ఎన్నికయ్యారు. తదనంతరం రాకేశ్ మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం దిశగా చైతన్యయుత పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ తిప్పారపు గణేశ్, కార్యకర్తలు గణేశ్, హరీశ్, కిరణ్, వెంకటేశ్, శశి, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన ఇళ్లలో ఉండొద్దు

చెన్నారావుపేట : వర్షాకాలం నేపథ్యంలో శిథిలమైన ఇళ్లలో ఎవరు కూడా నివాసం ఉండొద్దని పంచాయతీ కార్యదర్శి వికాస్ గౌడ్ కోరారు. మూడ్రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండల కేంద్రంలోని ఈర్య తండాకు చెందిన గుగులోతు లాలు, ధరంసోతు యాకూబ్‌లకు చెందిన ఇళ్ల గోడలు తడిచి నేలకూలాయి. ఈ క్రమంలో వారికి పంచాయతీ కార్యదర్శి వికాస్‌గౌడ్ సోమవారం నోటీసులు అందజేశారు. ఇళ్లు ఖాళీ చేసి ఎంపీపీఎస్ స్కూల్‌లో నివాసం ఉండాలని సూచించారు.



నోటీసులు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి వికాస్